సాక్షి
రంగారెడ్డి
గురువారం । 29 । మే । 2025



ఆరుట్ల.. ఆదర్శం
సమాజంలో చాలామంది తమ పిల్లలను శక్తికి మించి ఫీజులు చెల్లిస్తూ ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. 8లో



అప్పులు తీర్చేందుకు..
కూన రవీందర్ గౌడ్‌ను బెదిరించిన కేసులో జీడిమెట్ల పోలీసులు ఇద్దరు సూడో నక్సల్స్‌ను రిమాండ్‌కు తరలించారు. 8లో



కుక్కల దాడిలో..
జీవాల మందపై కుక్కలు దాడి చేయడంతో 37 గొర్రెలు, మేకలు మృతిచెందగా మరికొన్ని గాయపడ్డాయి. 8లో

న్యూస్‌రీల్

నిరుపేదలకు నాణ్యమైన విద్య
విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి



మంచాల జెడ్పీహెచ్‌ఎస్‌ను సందర్శించిన ఆకునూరి మురళి తదితరులు

మంచాల: నిరుపేదలకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యమని విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. బుధవారం ఆయన జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు, ఎస్‌డీఎఫ్ సభ్యురాలు పద్మజతో కలిసి మంచాల జెడ్పీహెచ్‌ఎస్‌ను సందర్శించారు. పాఠశాల ఉపాధ్యాయ బృందంతో కలిసి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందడం కష్టతరమైందని.. భవిష్యత్ తరాలకోసం ప్రజల భాగస్వామ్యంతో పాఠశాలలను మరింత అభివృద్ధి దిశగా తీసుకుపోవాలన్నారు. ఈ మేరకు జూన్ 6వ తేదీన మంచాల గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. వారి వెంట ఎంఈఓ రాందాస్, ఉపాధ్యాయులు ఉన్నారు.

'ఉపాధి హామీ' నిర్వీర్యానికి కేంద్రం కుట్ర
సీపీఎం కార్యదర్శి పగడాల యాదయ్య



చింతపట్లలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న యాదయ్య

యాచారం: కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య అన్నారు. బుధవారం ఆయన చింతపట్ల, నల్లవెల్లి గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ రక్షణ కోసం ఈ నెల 30న కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలన్నారు. కూలీల పొట్టకొడుతున్న కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కోట్లాది రూపాయల రుణమాఫీ చేస్తోందని మండిపడ్డారు. ఉపాధిహామీ చట్టాన్ని కాపాడకునేందుకు సమష్టి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. వేలాది మంది కూలీలు తరలివచ్చి ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, నాయకులు సత్యం, జంగయ్య, గిరి, శ్రీశైలం, ప్రభాకర్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

విజయలక్ష్మి ఆస్పత్రిపై హెచ్‌ఆర్సీకి ఫిర్యాదు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని విజయలక్ష్మి ఆస్పత్రిపై మానవ హక్కుల కమిషన్(హెచ్‌ఆర్సీ)కు బాధితుడు గణేశ్ బుధవారం ఫిర్యాదు చేశాడు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఈనెల 4న విజయలక్ష్మి ఆస్పత్రిలో పురిటిలోనే పసికందులు మృత్యువాత పడ్డారని బాధితుడు తెలిపారు. ఈ సంఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి సంబంధిత వైద్యురాలు అనూషరెడ్డిపై చర్యలు తీసుకుని ఆస్పత్రి లైసెన్స్‌ను రద్దు చేయాలని ముఖ్యమంత్రికి, కలెక్టర్, డీఎంహెచ్ఓలకు ఇప్పటికే ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

8న ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో చేప ప్రసాదం పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న బత్తిన అమర్‌నాథ్ గౌడ్

హిమాయత్‌నగర్: నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జూన్ 8వ తేదీన చేప ప్రసాదం పంపిణీ చేయనున్నట్లు బత్తిన గౌడ్స్ కుటుంబ సభ్యులు వెల్లడించారు. బుధవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దివంగత బత్తిని హరినాథ్ గౌడ్ తనయుడు బత్తిన అమర్‌నాథ్ గౌడ్ మాట్లాడారు. మృగశిర కార్తె అయిన జూన్ 8న ఆదివారం ఉదయం 10 గంటలకు చేప ప్రసాదం పంపిణీ ప్రారంభిస్తామని తెలిపారు. దేశ, విదేశాల నుండి లక్షలాది మంది వస్తుంటారని, ఎవ్వరికీ ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పంపిణీ సజావుగా సాగడానికి ఈ సంవత్సరం ప్రభుత్వం సహకారాన్ని అందిస్తుందని వివరించారు. జీహెచ్‌ఎంసీ, వాటర్ వర్క్స్, ఆర్టీసీ, మున్సిపాలిటీ, పోలీస్, విద్యుత్ శాఖలతో పాటు మత్స్యశాఖలతో సమావేశాలు ఏర్పాటు చేసి అప్రమత్తంగా ఉన్నామన్నారు.

అవినీతి జలగలు!

రెవెన్యూ, రిజిస్ట్రేషన్, ఇరిగేషన్, విద్యుత్ శాఖల్లో తిష్ట



- జిల్లాలో తరచూ వెలుగు చూస్తున్న ఏసీబీ కేసులు
- అడ్డంగా పట్టుబడి జైలుకు వెళ్తున్నా మారని తీరు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: కార్యాలయాల ఆవరణలో అవినీతి రహిత సేవలంటూ తాటికాయంత పెద్ద అక్షరాలతో ప్రకటనలు.. లోపల అడుగు పెడితే గుప్పుమనే అవినీతి వాసనలు. ఇదీ.. అక్రమ వసూళ్లకు, అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన ప్రభుత్వ కార్యాలయాల్లోని పరిస్థితి. ఇందులో దొరికిన వారే దొంగలు.. దొరకని వారు దర్జాగా దండుకుంటున్నారు. జిల్లాలోని రెవెన్యూ సహా రిజిస్ట్రేషన్, ఇరిగేషన్, విద్యుత్ శాఖల్లో అవినీతి జలగలెన్నో తిష్టవేసి కూర్చున్నాయి. ఆయా శాఖలకు తీరని మచ్చను తెచ్చిపెడుతున్నాయి. అక్రమ వసూళ్లకు పాల్పడుతూ ఒకరి తర్వాత మరొకరు ఏసీబీ వలకు చిక్కుతున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన అక్రమార్కులను అరెస్టు చేసి జైలుకు పంపుతున్నా.. వైఖరిలో మాత్రం మార్పు రాకపోవడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది.

అదనపు కలెక్టర్ ఘటన మరువక ముందే..

14 గుంటల భూమికి పాసుపుస్తకం కోసం గుర్రంగూడకు చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.8 లక్షలు డిమాండ్ చేసి, ఏసీబీ కేసులో జైలుకు వెళ్లిన అదనపు కలెక్టర్ ఎంవీ భూపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్‌రెడ్డిల వ్యవహారాన్ని పూర్తిగా మరువక ముందే.. తాజాగా ఇబ్రహీంపట్నం తహసీల్దార్ ఆఫీసులో మరో తిమింగలం ఏసీబీ వలకు చిక్కడం చర్చనీయాంశంగా మారింది. ఏడు గుంటల భూమికి పాసు పుస్తకం జారీకి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జి.కృష్ణ రూ.12 లక్షలు డిమాండ్ చేయడంతో ఆదిబట్లకు చెందిన ఓ బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. దీంతో బుధవారం ఆయన్ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

రెవెన్యూలో మచ్చుకు కొన్ని..

ఐదేళ్ల క్రితం కేశంపేట తహసీల్దార్ లావణ్య, అప్పటి వీఆర్‌ఓ అనంతయ్య ఏసీబీకి పట్టుబడ్డారు. రెవెన్యూ రికార్డులో పేరు మార్పిడికి రూ.9 లక్షలు డిమాండ్ చేసి రూ.4 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ పట్టుకుంది. తనిఖీల్లో భాగంగా ఆమె ఇంటి నుంచి రూ.93 లక్షల నగదు, భారీగా బంగారు ఆభరణాలు పట్టుబడటం అప్పట్లో సంచలనం రేపింది. మూడేళ్ల క్రితం కందుకూరు మాజీ ఎంపీఓ సహా పంచాయతీ మాజీ కార్యదర్శి సైతం ఏసీబీ వలకు చిక్కారు. నిషేధిత జాబితాలో ఉన్న వివాదాస్పద 98 దరఖాస్తులు తన ప్రమేయం లేకుండా ఆమోదం పొందాయని పేర్కొంటూ అప్పటి కలెక్టర్ భారతి హోళికేరీ ఆదిబట్ల ఠాణాలో ఫిర్యాదు చేయడంతో ఇద్దరు ఆపరేటర్లను అరెస్టు చేశారు.

విద్యుత్, ఇరిగేషన్‌లోనూ..

జిల్లా నీటిపారుదలశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బన్సీలాల్, అసిస్టెంట్ ఇంజనీర్ కె.కార్తీక్, ఎస్‌ఈ ఆఫీసులోని ఏడబ్ల్యూ సెక్షన్ ఏఈ హెచ్.నిఖేష్‌కుమార్, గండిపేట మండల సర్వేయర్ పి.గణేశ్ ఏడాది క్రితం ఏసీబీకి చిక్కారు. వీరు బఫర్‌జోన్లలో నిర్మాణాలకు ఎన్‌ఓసీ జారీ చేసే విషయంలో నెక్నంపూర్‌కు చెందిన బొమ్మ నరేందర్‌రెడ్డి నుంచి రూ.2.50 లక్షలు డిమాండ్ చేసి మే 31న ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఇదే కేసులో పట్టుబడిన ఓ ఏఈ ఆస్తులు ఏకంగా వంద కోట్లకుపైగా ఉన్నట్లు గుర్తించారు. విద్యుత్ శాఖలోనూ పెద్ద సంఖ్యలోనే పట్టుబడ్డారు. గోపన్‌పల్లిలోని ఓ బహుళ అంతస్తుల భవనానికి ట్రాన్స్‌ఫార్మర్ సహా సిటీమీటర్ జారీ కోసం కాంట్రాక్టర్ శివారెడ్డి నుంచి రూ.50 వేలు తీసుకుంటూ గచ్చిబౌలి డివిజన్ ఏడీఈ సతీశ్ ఇటీవల ఏసీబీకి చిక్కారు. అంతకు ముందు ఇదే డివిజన్‌లో పని చేసిన ఏడీఈ రాములు, కొండాపూర్ డీఈ వెంకటరమణ ఇదే కేసుల్లో పట్టుబడ్డారు. ఇక గొర్రెల పంపిణీ పథకం స్కాంతో సంబంధం ఉన్న జిల్లాకు చెందిన అప్పటి పశు సంవర్ధకశాఖ అధికారి అంజలప్ప, అప్పటి భూగర్భ జలవనరులశాఖ అధికారి రఘుపతి రెడ్డిలను ఏసీబీ అరెస్టు చేసింది.



మైనింగ్ ప్రాజెక్టు ఏర్పాటు చేయవద్దని నిరసన తెలుపుతున్న రైతులు

మైనింగ్ ఏర్పాటు వద్దు

- పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలో రైతులు
- సమావేశానికి బయటి వ్యక్తులను తీసుకువచ్చిన నిర్వాహకులు

కందుకూరు: మైనింగ్ ప్రాజెక్టు ఏర్పాటుకు బుధవారం నిర్వహించిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ఆందోళనల నడుమ ముగిసింది. కందుకూరు రెవెన్యూ సర్వే నంబర్ 338, 339లో 4.75 హెక్టార్ల భూమిలో మెస్సర్స్ గాంగే మినరల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మైనింగ్ ప్రాజెక్టు ఏర్పాటు చేయనుంది. అందుకు సంబంధించి పర్యావరణ అనుమతులకు కాలుష్య నియంత్రణ మండలి ఈఈ వెంకటనర్సయ్య, ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ గోపాల్ సమక్షంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. కాగా ఆ భూమికి చుట్టు పక్కల ఉన్న రైతులు మైనింగ్ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎస్.పాండు, మాజీ ఉప సర్పంచ్ జి.సుధాకర్‌రెడ్డి, రైతులు జగన్, బీరప్ప, విలాసిత్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా తమ భూముల పక్కనే మైనింగ్‌కు అనుమతులు ఇవ్వడంతో చాలా ఇబ్బందులు పడ్డా మని తెలిపారు. బ్లాస్టింగ్‌లతో బోర్లలో మోటార్లు కూరుకుపోవడం, పొలాల్లో రాళ్లు వచ్చి పడడం, దుమ్ము, ధూళితో పంట నష్టపోయామని వాపోయారు. మైనింగ్ ఏర్పాటు చేయవద్దని తేల్చి చెప్పారు. కొందరు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మైనింగ్ ఏర్పాటు చేయాలని, మరికొందరు మాత్రం రైతులకు ఇబ్బందులు కలుగకుండా వారిని ఒప్పించాలని సూచించారు. సమీప గ్రామం తిమ్మాయిపల్లికి చెందిన కొందరు మాత్రం మైనింగ్ ఏర్పాటు చేయాలని కోరారు.

సమావేశంలో సంబంధం లేని వ్యక్తులు

కాగా పర్యావరణ ప్రజాభిప్రాయం పేరుతో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బుధవారం ఉదయం మైక్ ద్వారా దండోరా వేయించడం గమనార్హం. దీంతో చాలా మందికి అక్కడ అభిప్రాయ సేకరణ ఉందనే విషయమే తెలియదు. మరోపక్క మైనింగ్ కంపెనీ నిర్వాహకులు మాత్రం ముందు జాగ్రత్తగా బయటి ప్రాంతాల నుంచి సంబంధం లేని వ్యక్తులను తీసుకువచ్చి కూర్చోపెట్టారు. వారితో తమకు అనుకూలంగా చెప్పించుకునే ప్రయత్నం చేశారు. విషయాన్ని గుర్తించిన స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కాగా ప్రజాభిప్రాయ సేకరణలో వ్యక్తం చేసిన అంశాలను పైఅధికారులకు నివేదిస్తామని ఈ సందర్భంగా ఆర్డీఓ తెలిపారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ రాజు, ఆర్ఐ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచానికి సైనిక సత్తా చాటాం



మాట్లాడుతున్న రాజ్‌భూపాల్ గౌడ్

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్ గౌడ్

షాద్‌నగర్‌రూరల్: ఆపరేషన్ సిందూర్‌తో మన సైనికుల సత్తాను ప్రపంచ దేశాలకు చాటామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్ గౌడ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలో తిరంగా ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాజ్‌భూపాల్‌గౌడ్ మాట్లాడుతూ.. మన సైనికులు దేశ ప్రజలకోసం పోరాడుతున్నారన్నారు. పాకిస్తాన్‌పై భారత సైనికులు చేసింది ఆపరేషన్ మాత్రమేనని యుద్ధం కాదన్నారు. యుద్ధానికి దిగితే పాకిస్తాన్ కనుమరుగువుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అందె బాబయ్య, శ్రీవర్ధన్‌రెడ్డి, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, మహేందర్‌రెడ్డి, రమేష్, వెంకటేష్‌గుప్తా, వెంకటేష్, హరిభూషణ్ పటేల్, శ్రీనివాస్‌రెడ్డి, నాగవర్ధన్‌రెడ్డి, యువసత్తా లక్ష్మణ్‌కుమార్, శ్రీనివాస చారి, ప్రశాంత్, చంద్రశేఖరప్ప, వరలక్ష్మి, జలజ, శ్రీనివాస్, వంశీ, అశోక్, కుర్మయ్య, మనోహర్, శ్రీకాంత్, శంకర్, మమత తదితరులు పాల్గొన్నారు.

అధికంగా పాలిచ్చే పశువుల వివరాలు నమోదు చేయాలి
జిల్లా పశు గణనాభివృద్ధి సంస్థ అధికారి అరుణశ్రీ



శ్రీరాంనగర్‌లో వివరాలను యాప్‌లో నమోదు చేయిస్తున్న డాక్టర్ అరుణశ్రీ

మొయినాబాద్: సురభి చయాన్ శ్రకల కార్యక్రమంలో భాగంగా పది లీటర్లకు పైగా పాలిచ్చే ఆవులు, గేదెల వివరాలను భారత్ పశుధన్ యాప్‌లో నమోదు చేయాలని జిల్లా పశు గణనాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ అరుణశ్రీ గోపాల మిత్రలకు సూచించారు. బుధవారం మొయినాబాద్, చేవెళ్ల, షాబాద్ మండలాల్లోని గోపాలమిత్ర కేంద్రాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ అరుణశ్రీ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కువ పాలిచ్చే జన్యువులు ఉన్న ఆవులు, గేదెలను గుర్తించేందుకు భారత ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తద్వారా పశుపోషకదారులకు ప్రోత్సాహకాలు అందించేందుకు ప్రభుత్వం యోచిస్తుందన్నారు. గ్రామాల్లో పర్యటించి అధికంగా పాలిచ్చే ఆవులు, గేదెలను గుర్తించి భారత్ పశుధన్ యాప్‌లో వివరాలను నమోదు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో గోపాల మిత్రలు శ్రీనివాస్, యాదయ్య, బాలకిష్టయ్య, విద్యాసాగర్, రాజేశ్, నరేశ్ పాల్గొన్నారు.

ప్రజల పక్షాన ఉద్యమించాలి

- ఉపాధి అవకాశాలు లేకనే కుటుంబ వ్యవస్థలు ఛిన్నాభిన్నం
- సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బీఎస్ఆర్ మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న బీఎస్ఆర్ మోహన్‌రెడ్డి

చేవెళ్ల: గ్రామీణ ప్రాంత పేదలకు ఉపాధి అవకాశాలు సన్నగించడంతోనే కుటుంబ వ్యవస్థలు ఛిన్నాభిన్నమవుతున్నాయని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు, చైతన్య విజ్ఞాన సమితి కార్యదర్శి బీఎస్ఆర్ మోహన్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి జన సేవాదళ్ శిక్షణ శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జన సేవాదళ్ రాష్ట్ర కన్వీనర్ పంజాల రమేశ్ అధ్యక్షతన మూడో రోజు బుధవారం భారత ఆర్థిక వ్యవస్థ–పరిణామాలు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్ఆర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలో నాల్గవ స్థానానికి తీసుకెళ్లామని గొప్పలు చెబుతున్న బీజేపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత పేదలకు ఉపాధి కల్పించడంలో విఫలమవుతున్నాయని మండిపడ్డారు. సూక్ష్మ, చిన్న పరిశ్రమలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. దేశం అభివృద్ధి చెందుతోందని చెబుతూనే.. 80 కోట్ల మంది పేదలకు రేషన్ షాపుల నిత్యావసర సరుకులను అందిస్తున్నామని ప్రకటిస్తున్నారన్నారు. వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ విధ్వంసానికి గురిచేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటు రంగాల్లో పని చేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడం లేదన్నారు. జన సేవాదళ్ సభ్యులు ప్రజల పక్షాన ఉద్యమించేందుకు సిద్ధమవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, జాతీయ జన సేవా ఇన్‌స్పెక్టర్ మురళి, జి.విష్ణు, గోస్కొ మోహన్, ఎం.అనిల్‌కుమార్, సిద్దినేని కర్ణకుమార్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు రామస్వామి, ప్రభులింగం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, నాయకులు సత్తిరెడ్డి, జంగయ్య, మక్బూల్, అంజయ్య, శివ, మంజుల, మినాక్షి, బాబురావు, జన సేవాదళ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డెక్కిన రైతులు

మాడ్గుల మండల కేంద్రంలో ఆందోళన చేస్తున్న రైతులు

- ఎకరాకు రూ.50 లక్షల పరిహారం ఇవ్వండి
- లేదంటే డీఎల్ఐ ప్రాజెక్టు రద్దు చేయండి

మాడ్గుల: డిండి లిఫ్ట్ ఇరిగేషన్(డీఎల్ఐ) ప్రాజెక్టు రద్దు చేయాలని కోరుతూ ఇర్విన్, నల్లచెరువు, రెడ్డిపల్లి రైతులు రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మాల్ రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. నల్గొండ జిల్లా రైతులకు నీరందించేందుకు నిర్మించిన తలపెట్టిన డిండి లిఫ్ట్ ఇరిగేషన్‌తో తాము నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు రూ.8లక్షల పరిహారం చెల్లిస్తున్నారని..ఆ పరిహారంతో గుంట భూమి దొరికే పరిస్థితి లేదని మండిపడ్డారు. ఎంత భూమి కోల్పోతే అంత భూమి లేదా ఎకరాకు రూ.50లక్షల చొప్పున పరిహారం చెల్లించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రైతులకు సమాచారం లేకుండానే పరిహారం జమ చేయడం సరికాదన్నారు. ప్రాణాలు పోయినా భూములిచ్చేది లేదంటూ భీష్మించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి తహసీల్దార్ వినయ్ సాగర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



పరీక్ష రాస్తున్న విద్యార్థిని

ఒక్కరి కోసం.. ఆరుగురు

ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో చివరి రోజు బుధవారం చేవెళ్ల పరీక్ష కేంద్రంలో ఒకే విద్యార్థినితో పరీక్ష కేంద్రం కొనసాగింది. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆదర్శ కళాశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ కోర్సులకు సంబంధించి చివరి పరీక్ష ఉండగా ఆదర్శ కళాశాలలో ఇద్దరు విద్యార్థులు హాజరుకావాల్సి ఉంది. ఒకే విద్యార్థిని హాజరవడంతో నిబంధనల ప్రకారం చీఫ్ సూపరింటెండెంట్, ఇన్విజిలేటర్, ఎగ్జామినర్, సిట్టింగ్ స్క్వాడ్, కానిస్టేబుల్, ఏఎన్‌ఎం విధులకు హాజరయ్యారు.

– చేవెళ్ల

పరిహారం.. పరిహాసం

- కేసు పెండింగ్‌లో ఉన్నా పట్టించుకోని అధికారులు
- అసలు పట్టాదారుకు కాకుండా మరొకరికి రూ.1.25కోట్లు, ఐదు ప్లాట్ల సర్టిఫికెట్ల అందజేత
- గ్రామస్తులతో కలిసి ఆర్డీఓని ఆశ్రయించిన బాధిత రైతు



కందుకూరు ఆర్డీఓకు సమస్య వివరిస్తున్న పట్టాదారు, గ్రామస్తులు

కందుకూరు: కోర్టులో కేసు.. అధికారుల వద్ద పూర్తి సమాచారం ఉన్నప్పటికీ ఫార్మాసిటీ భూ పరిహారం మాత్రం అసలు పట్టాదారుకు కాకుండా మరొకరికి అందింది. రూ.1.25 కోట్లతో పాటు అదనంగా ఐదు ప్లాట్ల సర్టిఫికెట్లు అందించారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన ప్రకారం. మండల పరిధిలోని ముచ్చర్ల రెవెన్యూ సర్వే నంబర్ 288/1క్యాలో ముచ్చర్ల అనుబంధ గ్రామం ఊట్లపల్లికి చెందిన బొర్ర బుచ్చయ్యకు వారసత్వంగా వచ్చిన ఐదెకరాల పట్టా భూమి ఉంది. అదే గ్రామానికి చెందిన కుందేళ్ల రాములు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై 2006–07లో తప్పుడు ప్రొసీడింగ్ నంబర్ 1621/1992తో తన పేరిట నమోదు చేయించుకున్నాడు. రాములు మృతి చెందడంతో 2011లో ఆయన భార్య జంగమ్మ తన పేరిట విరాసత్ చేయించుకుంది. ఆలస్యంగా గుర్తించిన బుచ్చయ్య రెవెన్యూ అధికారులకు మొరపెట్టుకున్నాడు. ఫలితం లేకపోవడంతో ఇబ్రహీంపట్నం కోర్టును ఆశ్రయించాడు. అనంతరం కేసు పరిశీలించిన జేసీ 2015లో రికార్డులు అసలు పట్టాదారుకు అనుకూలంగా మార్చాలంటూ ఆదేశాలిచ్చారు. అయినప్పటికీ మార్చలేదు. ఈ క్రమంలో 2016లో ఫార్మాసిటీ కోసం ఆ సర్వే నంబర్‌లోని భూములను ప్రభుత్వం సేకరించే పనులు ప్రారంభించింది. దీంతో పరిహారం తనకే చెల్లించాలని కోరుతూ అసలు పట్టాదారు బుచ్చయ్య హైకోర్టును ఆశ్రయించాడు. ఈ భూవివాదం పెండింగ్‌లో ఉండగానే 2023 అక్టోబర్ 19న కుందేళ్ల జంగమ్మకు ఎకరాకు రూ.25 లక్షల చొప్పున రూ.1.25 కోట్లు పరిహారం చెల్లించి ఎకరాకు 121 గజాల చొప్పున ఐదు ప్లాట్లు కేటాయిస్తూ సర్టిఫికెట్లు జారీ చేశారు. విషయాన్ని గుర్తించిన అసలు పట్టాదారు గ్రామస్తులతో కలిసి బుధవారం ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డిని కలిసి తన గోడు వెళ్లబోసుకున్నాడు. కోర్టులో కేసుండగా పరిహారం ఎలా ఇస్తారంటూ ప్రశ్నించాడు. ఇందుకు స్పందించిన ఆర్డీఓ పూర్తి సమాచారం కలెక్టర్‌కు నివేదిస్తానని.. ఆయన ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

బాధితులు ఎందరో!

కాగా ఫార్మాసిటీ పరిహారం చాలా మంది రైతులకు ఇంకా పెండింగ్‌లోనే ఉంది. మరోపక్క అధికారులు భూములకు ఫెన్సింగ్ వేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. తమకు న్యాయం చేసిన తర్వాతే ఫెన్సింగ్ పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. మరోపక్క గతంలో పరిహారం ఇచ్చే సమయంలో బోర్లకు, షెడ్లకు, చెట్లకు ఇస్తామని చెప్పిన అధికారులు పరిహారం చెల్లించే సమయంలో ఆ ఊసేలేదు. దీంతో రైతులు అధికంగా నష్టపోవాల్సి వచ్చింది.

రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నా


ఇబ్రహీంపట్నం: కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు, కూలీలు

ఉపాధి కూలీలకు బిల్లులు విడుదల చేయాలని సీపీఎం నేతల డిమాండ్

ఇబ్రహీంపట్నం: ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం ఈనెల 30న జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.జగన్ కోరారు. సీపీఎం నేతలు బుధవారం మండలంలోని ముకునూర్, రాయపోల్, నెర్రపల్లి గ్రామాల పరిధిలో ఉపాధి కూలీలు పనిచేసే ప్రదేశానికి వెళ్లి ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా సాధించిన ఉపాధి హామీ పథకాన్ని ప్రభుత్వాలు నిరుగార్చేందుకు యత్నిస్తున్నాయని ఆరోపించారు. పని ప్రదేశంలో కూలీలకు సౌకర్యాలు కల్పించడంలేదని, సామగ్రి ఇవ్వడం లేదని, రవాణా చార్జీలు చెల్లించడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కూలీలు చేసిన పనికి వెంటనే డబ్బులు చెల్లించాలని, పని దినాలను 200 రోజులకు పెంచాలని, రోజు కూలీ రూ.600 ఇవ్వాలని ధర్నా చేపట్టుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు కాకి రమేశ్, నాయకులు పల్లపు రవి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

మహాలింగాపురంలో సమావేశం

శంకర్‌పల్లి: ఉపాధి హామీ కూలీల పెండింగ్ బిల్లుల విడుదలపై ఈ నెల 30న కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కాడిగళ్ల భాస్కర్ కోరారు. బుధవారం మండలంలోని మహాలింగాపురంలో ఉపాధి హామీ కూలీలతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ కూలీల బకాయిలు చెల్లించకపోవడం బాధకరమని, అదే విధంగా పట్టణాల్లో నివసించే పేదలకు ఉపాధి హామీ పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కూలీలకు రోజువారి వేతనం రూ.600 ఇవ్వాలని, 200 రోజుల పని దినాలు, కొత్త జాబ్ కార్డులు, భార్యాభర్తలకు పరికరాలు, తదితర సమస్యలపై కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు బోడ మల్లేశ్, సీపీఎం డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్, నాయకులు నర్సింలు, రవి, రాములు, బాల్‌రెడ్డి, వెంకటేశం, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.


శంకర్‌పల్లి: మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

హోంగార్డు అదృశ్యం


సత్యనారాయణ (ఫైల్)

మొయినాబాద్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ హోంగార్డు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్‌కు చెందిన సిద్ధ సత్యనారాయణ(52) గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 26న మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఓయూ కామర్స్ దిగ్గజం ప్రొ.రామకృష్ణ శర్మ కన్నుమూత


ప్రొ.రామకృష్ణ శర్మ (ఫైల్)

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ కామర్స్ దిగ్గజం ప్రొ.రామకృష్ణ కన్నుమూశారు. ఓయూలో ఎంకాం పూర్తి చేసి పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ అందుకున్న మొదటి విద్యార్థిగా గుర్తింపు పొందారు. అధ్యాపకుడిగా బోధనతో పాటు పరిశోధనలు, పాలన పదవులు నిర్వహించారు. గురువారం ఆయన అంత్యక్రియలు జరగనున్నట్లు అధికారులు తెలిపారు.

ఆరుట్ల.. ఆదర్శం

నేటి సమాజంలో చాలామంది తమ శక్తికి మించి ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలను చేర్పిస్తున్నారు. భరించలేని ఫీజుల మోతతో కుదేలవుతున్నారు. అలాంటి వారికి సర్కారు బడిలోనే నాణ్యమైన విద్య దొరికితే పట్టరాని సంతోషం. సరిగ్గా అలాంటి కోవలోకి చెందిందే ఆరుట్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల.

- జెడ్పీహెచ్ఎస్‌లో నాణ్యమైన బోధనకు కృషి
- ప్రభుత్వం, ప్రజల భాగస్వామ్యంతో పునాది
- ఇప్పటికే కొనసాగుతున్న అభివృద్ధి పనులు
- ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న ఎస్ఎంసీ


ఆరుట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

మంచాల: అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్య పేద విద్యార్థులకు అందాలనే సంకల్పంతో అధికారులు, స్థానిక నాయకగణం కంకణ బద్ధులయ్యారు. చిన్నారులకు బంగారు భవిష్యత్‌ను ఇవ్వడానికి మండలంలోని ఆరుట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆదర్శ బడిగా రూపుదిద్దుకోనుంది. అందుకు ప్రజల భాగస్వామ్యాన్ని జోడించనున్నారు. ఇక్కడ జెడ్పీ ఉన్నత, మోడల్ స్కూల్, ప్రాథమిక, ప్రీ ప్రైమరీ పాఠశాలలు ఒకే ఆవరణలో ఉన్నాయి. 2024 డిసెంబర్‌లో రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ చైర్మన్‌గా ఆకునూరి మురళి మొదటిసారిగా ఈ పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులతో చర్చించి తల్లిదండ్రుల భాగస్వామ్యం ఉంటే ప్రభుత్వ పాఠశాలను ఉన్నతంగా తీర్చి దిద్దగలమని సూచించారు. ఇందులో భాగంగా ఎస్ఎంసీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ముందుకు వచ్చింది.

వడివడిగా అడుగులు

గ్రామస్తులందరూ ప్రైవేట్ పాఠశాలలకు పిల్లలను పంపించకుండా ప్రతిఒక్కరూ ప్రభుత్వ బడులకే పంపించాలని గ్రామ పంచాయతీ తీర్మానం చేశారు. ఎస్ఎంసీ కమిటీ సభ్యులను రాష్ట్రంలోనే ఆదర్శ పాఠశాలగా పేరున్న వరంగల్ జిల్లాలోని వంటి మామిడి ప్రభుత్వ పాఠశాలను తీసుకెళ్లారు. అక్కడ కొనసాగుతున్న పాఠశాల నిర్వహణ తీరుపై అవగాహన కల్పించారు. అదే విధంగా రంగారెడ్డి జిల్లా రావిర్యాల గ్రామంలో ఉన్న హగాకాన్ వంటి ప్రైవేట్ పాఠశాలను కూడా సందర్శించారు. ఆరుట్ల పాఠశాల అభివృద్ధికి నిర్దిష్ట ప్రణాళికతో కూడిన కార్యాచరణను సిద్ధం చేశారు.


పాఠశాలను సందర్శించిన సీఎం కార్యదర్శి అజిత్‌రెడ్డి, ఆకునూరి మురళి (ఫైల్)

కొత్తగా ఇంగ్లిష్ మీడియం

పాఠశాల అభివృద్ధికి సోషల్ డెమోక్రటిక్ ఫోరం(ఎస్‌డీఎఫ్) రూ.2 కోట్లు విరాళంగా అందజేసింది. వాటితో మౌలిక వసతుల కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే ప్రభుత్వం రూ.23 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేసింది. ప్రహరీ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం వంటి పనులు కొనసాగుతున్నాయి. కొత్తగా ప్రీ ప్రైమరీ పాఠశాల స్థాయి నుంచే ఇంగ్లిష్ మీడియం, డిజిటల్ తరగతుల నిర్వహణ, అందుకు అనుగుణంగా తరగతి గదుల నిర్మాణం పనులు జరుగుతున్నాయి. జీఎంఆర్ సంస్థ సహకారంతో గ్రీనరీ ఏర్పాటు చేయనున్నారు. క్రీడలకు అనువుగా ఆట స్థలం ఏర్పాటు చేస్తున్నారు.

స్వచ్ఛందంగా బడిబాట



పాఠశాల అభివృద్ధిలో ప్రజల సహకారం మరువలేనిది. 26 మందితో ఎస్ఎంసీ కమిటీ వేశారు. ఒక్కో విద్యార్థి తరఫున తల్లిదండ్రులు రూ.వెయ్యి కంట్రిబ్యూషన్ ఇవ్వాలి. స్వచ్ఛందంగా అందరూ బడి బాట కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఇప్పటికే బడిలో 570 మంది విద్యార్థులు ఉన్నారు. కొత్తగా 200 మంది చేరారు.

– జానీ పాషా, ఎస్ఎంసీ సభ్యుడు, ఆరుట్ల

దాతల సహకారం ముఖ్యం



ఆరుట్ల ప్రభుత్వ పాఠశాల రాష్ట్రంలోనే మొదటి తెలంగాణ పబ్లిక్ పాఠశాలగా మారనుంది. అందుకోసం ప్రణాళికబద్ధంగా పనులు కొనసాగుతున్నాయి. ప్రజల సహకారం ఎంతో ఉంది. ఇప్పటికే దాతలు బోర్లు, వాటర్ ఫిల్టర్, టేబుల్స్ ఏర్పాటు చేశారు. పాఠశాల విషయంలో గ్రామస్తులు ఏకపక్షంగా అండగా ఉంటున్నారు.

– జంగయ్య, ఎస్ఎంసీ సభ్యుడు, ఆరుట్ల

సర్కారు బడికి పంపండి



పాఠశాలలో ప్రభుత్వం సహకారంతో మరింత అభివృద్ధి జరుగుతుంది. పూర్తిగా ఇంగ్లిష్ మీడియం, నాణ్యమైన విద్యను అందించడమే గాకుండా ఉన్నత విద్య కోసం అన్ని రకాలుగా ప్రోత్సహిస్తాం. ఉపాధ్యాయుల నుంచి శక్తి వంచన లేకుండా పని చేస్తాం. మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకే పంపించండి.

– గిరిధర్‌గౌడ్, ప్రధానోపాధ్యాయుడు, జెడ్పీహెచ్ఎస్ ఆరుట్ల

కుక్కల దాడిలో 37 జీవాలు మృతి

15 గొర్రె పిల్లలకు తీవ్రగాయాలు

- దయ్యాల్‌గుండుతండాలో ఘటన
- ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడి వేడుకోలు

మహేశ్వరం: జీవాల మందపై కుక్కలు దాడి చేయడంతో 37 గొర్రెలు, మేకలు మృతిచెందగా మరికొన్ని గాయపడ్డాయి. ఈ సంఘటన మండల పరిధిలోని దయ్యాల్‌గుండుతండాలో చోటు చేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం.. తండాకు చెందిన డాక్యానాయక్ రోజూమాదిరిగానే మంగళవారం సాయంత్రం తన జీవాలను దొడ్లో తోలి, ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి వేళ పది వీధి కుక్కలు మందపై దాడి చేయడంతో 37 గొర్రెలు, మేకలు మృతి చెందాయి. మరో 15 గొర్రె పిల్లలకు తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం తెల్లవారుజామున వెళ్లిన డాక్యానాయక్ ఇది చూసి బోరున విలపించాడు. వెటర్నరీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో మహేశ్వరం పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ లలిత ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. గాయపడిన జీవాలకు చికిత్సలు అందించారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. మరణించిన గొర్రెలు, మేకల విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.


మరణించిన గొర్రెలు, మేకల వద్ద విలపిస్తున్న బాధితుడు

కేరళ లాటరీ పేరుతో రూ.7.55 లక్షలు స్వాహా

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగినికి కేరళ లాటరీ పేరుతో ఎర వేసిన సైబర్ నేరగాళ్లు రూ.7.55 లక్షలు స్వాహా చేశారు. దీనిపై బాధితురాలు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో బుధవారం కేసు నమోదైంది. బాధితురాలికి (54) గత నెల 7న 'కేరళ లాటరీ' ప్రతినిధి పేరుతో ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. మధ్యాహ్నం 2 గంటలకు తమ లాటరీ ఫలితాలు ప్రకటిస్తున్నామని చెప్పాడు. దీంతో ఆమె ఓ టికెట్ ఖరీదు చేశారు. అదే రోజు సాయంత్రం రూ.5 లక్షల లాటరీ గెల్చుకున్నట్లు ఆమెకు సమాచారం ఇచ్చాడు. ఆ మొత్తం తీసుకోవాలంటే ముందుగా కొన్ని పన్నులు చెల్లించాలంటూ ఓ లింకు పంపాడు. బాధితురాలు దానిని క్లిక్ చేయగా... లాటరీ గెల్చినట్లు, వివిధ పన్నులు చెల్లించాలని ఉంది. బాధితురాలు చెల్లించిన మొత్తం నామ మాత్రమే నాన్ రిఫండబుల్ అని, మిగిలింది లాటరీ నగదుతో పాటు రిఫండ్ చేస్తామని నమ్మించారు. ఇలా ఆమె నుంచి రూ.7,55,220 డిపాజిట్ చేయించుకుని మోసం చేశారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి


అనసూయ (ఫైల్)

మోతీనగర్: భవన నిర్మాణ పని చేస్తున్న మహిళ విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సంఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సామల వెంకట్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సఫ్దార్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనంలో గుంపు అనసూయ (45) అనే మహిళ కూలీ పని చేస్తోంది. బుధవారం ఆమె మెటీరియల్ లిఫ్ట్ వద్ద పని చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయింది. తోటి కూలీలు ఆమెను ఈఎస్ఐ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. బిల్డింగ్ యజమాని, బిల్డర్ నిర్లక్ష్యం కారణంగానే అనసూయ మృతి చెందిందని ఆమె కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బిల్లు ఎక్కువ వేశారన్నందుకు

- లైట్లు ఆర్పి మహిళలపై దాడి
- జూబ్లీహిల్స్‌లోని బేబీలాన్ పబ్‌లో ఘటన

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని బేబీలాన్ పబ్‌లో తాము ఆర్డర్ చేయని డ్రింక్స్‌కు బిల్ వేశారని ప్రశ్నించినందుకు సిబ్బంది కస్టమర్లపై దాడికి పాల్పడ్డారు. పబ్‌లో లైట్లు ఆర్పి తన తల్లి, చెల్లిపై దాడి చేశారని సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ మీనల్ మీను ఆరోపిస్తోంది. ఈ మేరకు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. బాధితురాలి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ మీనల్‌మీను మంగళవారం రాత్రి తన తల్లి, చెల్లితో కలిసి జూబ్లీహిల్స్‌లోని బేబీలాన్ పబ్‌కు వెళ్లింది. ఈ సందర్భంగా తాము తాగని డ్రింక్స్‌కు కూడా బిల్లు వేసినట్లు గుర్తించిన ఆమె పబ్ సిబ్బందిని ప్రశ్నించింది. దీంతో వారితో వాగ్వాదానికి దిగిన పబ్ నిర్వాహకులు సిబ్బందితో కలిసి పబ్‌లో లైట్లు ఆపేసి ఆమె తల్లి, చెల్లిపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిపై ఆమె సోషల్ మీడియా వేదికగా వివరించింది. తాము ఆర్డర్ చేయని డ్రింక్స్‌కు బిల్ వేశారని అడిగినందుకు కొట్టారని, వీడియో తీస్తుంటే బెదిరించి లైట్లు ఆర్పేసి దాడి చేశారని పేర్కొంటూ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్నారు. ఇప్పటికే పలువురు సిబ్బందిని విచారించారు. దాడికి పాల్పడింది బౌన్సర్లా..? సిబ్బందా అన్న దానిపై విచారణ కొనసాగుతోంది.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

సికింద్రాబాద్: రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జీఆర్ పోలీసుల కథనం ప్రకారం.. 3వ నెంబర్ ప్లాట్‌ఫామ్ ట్రాలీ పాత్ వే రైల్వే ట్రాక్ ప్రక్కన బుధవారం ఓ యువకుడి మృతదేహాన్ని గుర్తించిన రైల్వే సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు సుమారు 25 ఏళ్ల యువకుడు రైలు పట్టాలపై తలపెట్టి ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. మృతుడి ఒంటిపై తెలుపు, నలుపు గళ్ల చొక్కా, నీలిరంగు జీన్స్ ప్యాంటు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

అప్పులు తీర్చేందుకు సూడో నక్సల్ అవతారమెత్తి..

- తన ఇంటి ఓనర్‌ను టార్గెట్ చేసి బెదిరింపులు
- నిందితుల అరెస్ట్
- రవీందర్ గౌడ్‌ను బెదిరించిన కేసులో వీడిన మిస్టరీ


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నరేష్‌రెడ్డి..

జీడిమెట్ల: పారిశ్రామిక వేత్త కూన రవీందర్ గౌడ్‌ను బెదిరించి రూ. 50 లక్షలు డిమాండ్ చేసిన కేసులో జీడిమెట్ల పోలీసులు ఇద్దరు సూడో నక్సలైట్లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాడు. బుధవారం జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో బాలానగర్ ఏసీపీ పింగళి నరేష్‌రెడ్డి, ఇన్స్‌పెక్టర్ గడ్డం మల్లేష్, డీఐ కనకయ్యలతో కలిసి వివరాలు వెల్లడించారు. విజయవాడ, గన్నవరానికి చెందిన యర్రంశెట్టి రాజు అక్కడ చోరీలకు పాల్పడి జైలుకు వెళ్లివచ్చాడు. వ్యసనాలకు బానిసైన అతను అప్పులు చేసి జల్సా చేశాడు. అప్పు ఇచ్చిన వారు ఒత్తిడి చేస్తుండటంతో ఎలాగైనా పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో షాపూర్‌నగర్‌లో తాను నివాసం ఉంటున్న ఇంటి యజమాని కూన రవీందర్‌గౌడ్‌ను బెదిరించి డబ్బు లాగాలని పథకం వేశాడు. ఇందులో భాగంగా గన్నవరానికి చెందిన తన స్నేహితుడు కందురెల్లి రాజు(24)ను నగరానికి రప్పించుకున్నాడు. ఈనెల 21న రాత్రి పథకం ప్రకారం కందురెల్లి రాజును కూన రవీందర్‌గౌడ్ ఇంటికి పంపించాడు. స్నేహితుడు చెప్పినట్లుగానే అతను మెయిన్ గేట్‌లోనుంచి ఇంట్లోకి ప్రవేశించాడు. మొదటి అంతస్తులోకి వెళ్లి కిందికి వచ్చాడు. అక్కడ ఉన్న తులసి మొక్కను పీకేశాడు. అనంతరం ఎర్రరంగు టవల్‌లో ఓ లేఖను ఉంచి కారుపై పెట్టి వెళ్లిపోయాడు. మర్నాడు ఉదయం రవీందర్‌గౌడ్ కారుపై ఉన్న లేఖను చదివిన రవీందర్ గౌడ్ జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసును సవాల్ తీసుకున్న పోలీసులు ఏసీపీ నరేష్‌రెడ్డి నేతృత్వంలో జీడిమెట్ల ఇన్స్‌పెక్టర్ గడ్డం మల్లేష్, డీఐ కనకయ్య, ఎస్సై ప్రేమ్‌సాగర్ రంగంలోకి దిగారు. దాదాపు 500 సీసీ కెమెరాలను పరిశీలించి రవీందర్‌గౌడ్ ఇంట్లో అద్దెకు ఉంటున్న యర్రంశెట్టి రాజును నిందితుడిగా గుర్తించారు. దీంతో యర్రంశెట్టి రాజు, అతని స్నేహితుడు కందురెల్లి రాజులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. వారి నుంచి 13నాటు బాంబులు, 4 సెల్ ఫోన్‌లు, ఒక బెదిరింపు ఉత్తరాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. ఈ కేసును ఛేదించిన ఇన్స్‌పెక్టర్ మల్లేష్, డీఐ కనకయ్య, ఎస్సై ప్రేమ్‌సాగర్, పీసీలు నరేష్, రవినాయక్, వెంకటేష్‌లను ఏసీపీ అభినందించి రివార్డులు అందజేశారు. కాగా నాటు బాంబులు ఎలా వచ్చాయనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టినట్లు సమాచారం.

'రివర్స్ రూట్'లో గంజాయి స్మగ్లింగ్!

విశాఖ, ఒడిశా నుంచి సిటీకి అక్రమరవాణా

- ఇక్కడి నుంచి మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాలకు
- ఆయా మార్గాల్లో అనేక చెక్‌పోస్టుల ఏర్పాటు
- దీన్ని పసిగట్టిన ఘరానా దొంగ లాంబా హుస్సేన్
- నాగ్‌పూర్ నుంచి కారులో తీసుకువచ్చి విక్రయం
- విచారణలో గుర్తించిన సిటీ సీసీఎస్ స్పెషల్ టీమ్


హుస్సేన్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ ఆధీనంలోని స్పెషల్ జోనల్ క్రైమ్ టీమ్ అధికారులు ఇటీవల అరెస్టు చేసిన ఘరానా నేరగాడు సయ్యద్ సయీద్ హుస్సేన్ అలియాస్ లాంబా హుస్సేన్ విచారణలో కీలకాంశాలు వెలుగులోకి వస్తున్నాయి. సొత్తు సంబంధం నేరాల నుంచి గంజాయి దందాలోకి దిగిన అతను ఈ స్మగ్లింగ్‌లో 'రివర్స్ రూట్' విధానం అవలంభిస్తున్నట్లు బయటపడింది. మరోపక్క లాంబ ఐదు కేసుల్లో వాంటెడ్‌గా ఉన్నట్లు గుర్తించిన స్పెషల్ క్రైమ్ టీమ్ పోలీసులు ఆయా ఠాణాలకు సమాచారం ఇచ్చి పీటీ వారెంట్లు దాఖలు చేయిస్తున్నారు.

ఇప్పటి వరకు 300 కేసుల పైనే...

జహనుమకు చెందిన లాంబా హుస్సేన్ ఒకప్పుడు వరుస స్నాచింగ్స్‌తో నగరవాసులను హడలెత్తించాడు. వాటిలో కొన్ని దోపిడీలుగానూ నమోదు కాగా ఇతడిపై ఇప్పటి వరకు 300కు పైగా కేసులు ఉన్నాయి. 2014లో పీడీ యాక్ట్ ప్రయోగించడంతో పాటు కొన్ని కేసుల్లో శిక్షలు పూర్తి చేసుకుని 2017లో బయటకు వచ్చాడు. ఆపై తన పంథా మార్చిన లాంబా మరికొందరితో కలిసి బందిపోటు దొంగతనాలు, దోపిడీలు ప్రారంభించాడు. బంగారు వ్యాపారుల లావాదేవీలపై సమాచారం తెలుసుకుని, కాపు కాసి రెక్కీలు నిర్వహించాడు. మరో ఐదుగురితో కలిసి ముఠాగా ఏర్పడిన వారు బైక్‌లపై తిరుగుతూ బంగారం దుకాణాల నుంచి పసిడి, వెండితో వెళ్తున్న వారిని గుర్తించేవారు. వారిని కొంత దూరం వెంబడించిన తర్వాత దృష్టి మళ్లించడం/కారం చల్లడం/కత్తితో దాడి చేయడం చేసి సొత్తు దోచుకుని ఉడాయించేవారు. ఇలా 2022 అక్టోబర్ 3న బషీర్‌బాగ్, నవంబర్ 22న జూబ్లీహిల్స్, నవంబర్ 24న హిమాయత్‌నగర్, డిసెంబర్ 5న మహంకాళి పరిధుల్లో ఈ ముఠా పంజా విసిరింది. మొత్తం 30 కేజీల వెండి, వజ్రాభరణాలు, బంగారం, నగలు దోచేశారు.

జైలు నుంచి వచ్చి స్టైల్ మార్చేసి...

ఆయా కేసుల్లో పోలీసులు 2022 డిసెంబర్‌లో అరెస్టు చేశారు. ఈ కేసులో జైలు నుంచి విడుదలైన తరవాత అబిడ్స్, జూబ్లీహిల్స్, మహంకాళి, నారాయణగూడ, మహంకాళి ఠాణాల పరిధిలో సొత్తు సంబంధ నేరాలు చేశాడు. చైన్ స్నాచింగ్, దోపిడీ, బందిపోటు దొంగతనాలు చేస్తే కేసులు, పోలీసుల వేట, అరెస్టు, పీడీ యాక్ట్ తప్పడం లేదని భావించిన లాంబా గంజాయి దందా మొదలెట్టాడు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఐదుగురు యువకులను ఎంపిక చేసుకున్నాడు. సాధారణంగా నగరానికి ఒడిశా, ఆంధ్రప్రదేశ్ నుంచి గంజాయి స్మగ్లింగ్ అవుతుంది. సిటీ మీదుగానే మహారాష్ట్రకు వెళ్తుంది. ఈ నేపథ్యంలో ఈ మార్గాల్లో చెక్‌పోస్టులు, పోలీసుల తనిఖీలు ఉంటాయి. దీనిని గమనించిన లాంబా కొత్త ఎత్తు వేశాడు. నాగ్‌పూర్‌లో గంజాయి కొని, అక్కడి నుంచి కారులో సిటీకి తీసుకువచ్చి విక్రయిస్తున్నాడు. నాగ్‌పూర్ టు హైదరాబాద్ రూట్‌లో గంజాయి కోసం తనిఖీలు ఉండకపోవడం ఇతడికి కలిసి వచ్చింది. సిటీకి వచ్చిన తర్వాత ఆ గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లలోకి మార్చి నలుగురు అనుచరుల ద్వారా అమ్మించేవాడు.

ముమ్మరంగా గాలించి పట్టుకున్న టీమ్...

సుదీర్ఘ కాలంగా పరారీలో ఉన్న లాంబాతో పాటు అతడి అనుచరులను పట్టుకోవడానికి సీసీఎస్ స్పెషల్ జోనల్ క్రైమ్ టీమ్ రంగంలోకి దిగింది. దాదాపు ఆరు నెలలుగా అతడి కదలికలపై నిఘా ఉంచింది. ఇంటికి సైతం వెళ్లకుండా కారులోనే ఉంటూ పోలీసుల నిఘాను తప్పించుకుంటూ వచ్చాడు. లోతుగా ఆరా తీసిన సీసీఎస్ పోలీసులు దీనిని గుర్తించారు. తన కారులో నాగ్‌పూర్ నుంచి 21 కేజీల గంజాయి తీసుకువస్తుండగా గత మంగళవారం పట్టుకున్నారు. అతడిచ్చిన సమాచారంతో నలుగురు అనుచరులనూ కటకటాల్లోకి పంపారు. లాంబా పై పీడీ యాక్ట్ ప్రయోగానికి సంబంధించిన ప్రొసీడింగ్స్ సైఫాబాద్ ఠాణాలో పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించారు. ఇతడిని అబిడ్స్ పోలీసులకు అప్పగించగా... జూబ్లీహిల్స్, మహంకాళి, నారాయణగూడ, పోలీసులు పీటీ వారెంట్లు దాఖలు చేయనున్నారు. ఇతడిపై నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉన్నాయా? అనే అంశాన్ని ఆరా తీస్తున్నారు.